క్లుప్తంగా

శిశుగృహ సందర్శన



సీడీపీవో రమణకుమారి, సిబ్బందితో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

మల్కాపురం: రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు గురువారం ఆర్ అండ్ బీ దరి మల్కాపురంలోని శిశుగృహ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న చిన్నారుల యోగక్షేమాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు దస్త్రాలను పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సీడీపీవో రమణకుమారి, డీసీపీవో లక్ష్మి, పీవోఎస్ఐసీ మమత, మేనేజర్ సుజాత, సోషల్ వర్కర్ రామలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

19న దుర్గమాంబ జాతర



దుర్గమాంబ నిజరూపం

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం శాంతినగర్ వాసుల ఆరాధ్యదైవం దుర్గమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 19న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతినగర్ కొండవాలు ప్రాంతంలో కొలువైన అమ్మవారిని 16 గ్రామాల ప్రజలు ఇలవేల్పుగా కొలుస్తుంటారు. ఈ నెల 18న తొలేళ్లు, 19న ప్రధాన జాతర జరుగుతాయని ఆలయ ధర్మకర్త ఎరిపిల్లి అప్పారావు తెలిపారు. భక్తులకు ప్రత్యేక దర్శనాలు, అన్నసమారాధన, సాయంత్రం సాంస్కృతిక ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

జ్యూట్ బ్యాగుల తయారీలో కొత్తవారికి అవకాశం



జ్యూట్ బ్యాగులు తయారు చేస్తున్న మహిళలు

మురళీనగర్: జ్యూట్ బ్యాగుల తయారీ ఉచిత శిక్షణ తరగతుల్లో చేరడానికి కొత్తవారికి అవకాశం ఇస్తున్నట్లు మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ తెలిపారు. గురువారం ఆయన శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణకు మహిళల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఈ నెల 12 వరకు శిక్షణ కొనసాగిస్తామని, ఆసక్తి గల మహిళలు చేరవచ్చని చెప్పారు. శిక్షకురాలు సుగుణ ఆధ్వర్యంలో మహిళలు జ్యూట్ బ్యాగుల తయారీలో మెళకువలు నేర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా మహిళలు తయారు చేసిన బ్యాగులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు డి.వర ప్రసాద్, కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ, సహాయ కార్యదర్శి పి.సతీష్ కుమార్, ఎస్ఎస్‌వీ ప్రసాదరావు, శ్రీను, పీఎస్ఆర్ సూరిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ వెలుగులు

- జగన్ గెలుపే ప్రజలందరి గెలుపు
- సుపరిపాలనకు ఓటేయండి.. ఎమ్మెల్యేగా గెలిపించండి
- 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



గాంధీనగర్‌లో కె.కె.రాజుకు హారతిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళ





54, 55 వార్డుల్లో ప్రచార రథంపై మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ద్వారానే పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు విరజిమ్మాయని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 54వ వార్డు ఐటీఐ కూడలి, 104 ఏరియాలో కార్పొరేటర్ చల్లా రజిని ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచారం సభలో ఆయన మాట్లాడారు. పేదలందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచి అనేక సంక్షేమ పథకాలు అందజేసిందని తెలిపారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే పథకాలు చేరవేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని కె.కె.రాజు కోరారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, వార్డు అధ్యక్షుడు చల్లా ఈశ్వరరావు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా... ఆదరించండి

ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని, తనను ఆదరించి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు విజ్ఞప్తి చేశారు. 55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్‌లో కార్పొరేటర్ కె.వి.ఎస్.శశికళ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో అందరికీ అందుబాటులో ఉంటూ ప్రతి సమస్యను పరిష్కరించడమే కాకుండా ఉత్తరను ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి రూ.435 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కె.కె.రాజు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, వార్డు అధ్యక్షుడు కాయిత పైడి రత్నాకర్ యాదవ్, 54, 55 వార్డు ఎన్నికల పరిశీలకుడు బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, సీరపు దివాకర్‌రెడ్డి, సిద్ధార్థ, బద్రి, లక్ష్మి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా అపూర్వ ఆదరణ

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్‌లో గురువారం చేపట్టిన ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు మహిళలు పెద్ద ఎత్తున హారతులిచ్చి స్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరుతూ కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల, మతాలు, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిందన్నారు. రెండో సారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, కర్రి మురళీకృష్ణారెడ్డి, రమణారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

జగన్‌తోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 23వ వార్డు ప్రియదర్శిని కాలనీలో గురువారం ఎన్నికల ప్రచారం, అనంతరం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ గడప గడపకు వెళ్లారు. ప్రజలు హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ జగన్ పాలనలో విశాఖ పరిపాలన రాజధాని కానుందని, తద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ జి.వి.రమణి, బాక్సర్ రాజు, మొల్లి అప్పారావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కె.కె.రాజుకే మా ఓటు



తెలగ, కాపు కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

- మద్దతు తెలిపిన తెలగ, కాపు కుటుంబాలు

సీతంపేట: ఉత్తర నియోజకవర్గ పరిధి 43, 44, 45, 55 వార్డులకు చెందిన పలువురు కాపు, తెలగ కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు మద్దతు తెలిపారు. అక్కయ్యపాలెం షాదీఖానాలో గురువారం సాయంత్రం తెలగ, కాపు కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి కె.కె.రాజును ఎమ్మెల్యేగా గెలిపిస్తామని వారు అన్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రకాల పదవుల్లో కాపు, తెలగ కమ్యూనిటీ వారికి సముచిత స్థానం కల్పించారన్నారు. వారి సంక్షేమానికి కాపు నేస్తం అమలు చేశారని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ పథంలో నడిపించిన జగన్‌ను మళ్లీ సీఎం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా తెలగ, కాపు కుటుంబ సభ్యులు కె,కె.రాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, పైడి రమణ, ఠాగూర్, కన్నప్పుడు, తిరుపతి, సంజీవనాయుడు, కాయల శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

చేసిన మంచిని ఓటర్లకు వివరించండి



బూత్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

- వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయండి
- బూత్ ఏజెంట్లకు కె.కె.రాజు దిశానిర్దేశం

సీతమ్మధార: ఎన్నికల్లో ప్రతి ఏజెంట్ సైనికుడిలా పనిచేయాలని, మనం చేసిన మంచిని, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపునిచ్చారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో బూత్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో ఉత్తర నియోజకవర్గంలో రూ.435 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. రహేజ్ గ్రూప్ ఇనార్బిట్ మాల్, ఏఎంసీ మాల్ తదితర సంస్థల ద్వారా రూ.1,480 కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామన్నారు. తద్వారా 15 వేల నుంచి 18 వేల మంది స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరికీ మనం చేసిన అభివృద్ధిని తెలియపరచాలని కోరారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముందుగా బూత్ ఏజెంట్లకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ చంద్రమౌళి, నాగేశ్వరరెడ్డి, వుడా రవి, జి.వి.రవిరాజ్, భరణికాన రామారావు, ఆళ్ల శివగణేష్, ఎన్ఆర్ఐలు వెంకటరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కె.రాజుకు టైలర్ల మద్దతు



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు మద్దతు తెలుపుతున్న టైలర్లు



వర్తక సంఘం సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న మార్కండేయులు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె. రాజుకు ఉత్తర నియోజకవర్గ టైలర్లు తమ మద్దతు పలికారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం కె.కె.రాజును వారి కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ఇంటి వద్దే వలంటీర్ల ద్వారా అందజేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యాదగిరి రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్తక సంఘం పూర్తి మద్దతు

కంచరపాలెం: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును కంచరపాలెం వర్తక సంఘం పూర్తి మద్దతుతో గెలిపించుకుంటామని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు అన్నారు. కంచరపాలెం జోగారావునగర్ కమ్యూనిటీ హాల్‌లో వర్తక సంఘం సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం బాగా అభివృద్ధి చెందిందని, ఉత్తర నియోజకవర్గ అభివృద్ధికి కె.కె.రాజు ఎంతో కృషి చేశారన్నారు. జిల్లా మహిళా విభాగం కార్యదర్శి రాజ్‌కుమారి, ఈశ్వరరావు, రవి, నూకరత్నం, అనిత, ధనలక్ష్మి, సూరిబాబు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటేయండి

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



తాటిచెట్లపాలెం: సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ వాసులు అప్రమత్తంగా ఉండాలని, ఆలోచించి ఓటు వేయాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సూచించారు. రైల్వే న్యూ కాలనీలోని పార్టీ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ వాసులు తెలివైన వారన్నారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడతానని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని చెప్పారు. కూటమికి గానీ, జగన్‌కు గానీ ఓటు వేస్తే బీజేపీని గెలిపించినట్లేనని కేఏ పాల్ పేర్కొన్నారు.

రూ.435 కోట్లతో 'ఉత్తర' అభివృద్ధి



ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

మల్కాపురం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఉత్తర నియోజకవర్గంలో మునుపెన్న డూలేని విధంగా రూ.435 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు తెలిపారు. 49వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీ వైభవ పార్కులో, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో అంద రూ సహకరించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధి క మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పార్వతీశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ పి.బలరాం స్వామి, సెక్రటరీ కె.రామచంద్రరాజు, జాయింట్ సెక్రటరీ కృష్ణ మోహన్, ఆర్.శ్రీనివాసరావు, సాంబశివరావు, రాజారావు, పి.శ్రీనివాసరావు, కాలనీవాసులు బంగార్రాజు, చంద్రమౌళి, బాల చెన్నయ్య, ప్రసాదరావు, వెంకటరావు, శ్రీరాములు, పూర్ణచంద్రరావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రచార పర్వం



ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరుతూ 51వ వార్డు కళింగనగర్, విద్యనగర్, శంకర్‌నగర్, లేన్స్‌మ్‌గ్రీన్స్, వుడా క్వార్టర్స్ ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, పార్టీ నాయకురాలు పేడాడ రమణికుమారి, డైరెక్టర్లు పైడి శ్రీనివాసరావు, దిడ్డి రమేష్, ప్రసూనారెడ్డి, బి.తిరుమలరావు, రాజంరాజు, మెట్ట దమయంతి, పైడి ప్రతాప్, వరలక్ష్మి తదితరులు

- మల్కాపురం



సంక్షేమాభివృద్ధి కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరుతూ గురువారం 46వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్న జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ నాయకులు

- కంచరపాలెం



ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలంటూ వర్షంలో తడుస్తూ జీవీఎంసీ 43వ వార్డు నందగిరినగర్, న్యూకాలనీల్లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ

- సీతంపేట



కె.కె.రాజు, బొత్స ఝాన్సీలను గెలిపించాలని 45వ వార్డులో భారీ ర్యాలీ నిర్వహించి ఓటు అభ్యర్థిస్తున్న జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ఇన్‌చార్జి ప్రవీణ్‌వర్మ, పార్టీ నాయకుడు హరిపట్నాయక్ తదితరులు

- తాటిచెట్లపాలెం



ఉత్తర ఎమ్మెల్యేగా కె.కె.రాజును, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని అభ్యర్థిస్తూ 42వ వార్డు శివాలయం వెనుక వీధి, మూడు గుళ్లు, రెల్లి వీధి, నూకాలమ్మ గుడి ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాసరావు, కంచు రమణమూర్తి, మొల్లేటి జగన్ తదితరులు

- తాటిచెట్లపాలెం